సాహిత్యంపై ఎంతో అనురక్తి

బాలగోపాల్‌కు మానవ హక్కులపై ఎంత అవగాహన ఉందో, సాహిత్యంపైనా అంత అవగాహన ఉండేది. సాహిత్యంపై రూపం-సారం అనే పుస్తకం రాశారు. తెలుగు సాహిత్యానికి ఆయన ఎంతో సేవ చేశారు. "సృజనాత్మక రచనల పేరుతో ఎందరో సృజన లేని రచనలు చేశారు. కానీ బాలగోపాల్ సృజనాత్మక రచనల్ని చదివి, వాటిని ఎలా అర్థం చేసుకోవాలనే సైద్ధాంతిక దృక్కోణాన్ని అందించారు. తెలుగు సాహిత్యానికీ ఇది ఆయన చేసిన గొప్ప సేవ" అంటారు ఆయనతో ఎంతో సన్నిహితంగా మెలిగిన సాహితీ వేత్త జయధీర్ తిరుమలరావు. సామెతలంటే బాలగోపాల్‌కు ఎంతో ఇష్టం. సామెత సమాజం నుంచి వస్తుంది. సామెతను సమాజంలోని వ్యక్తులు వాడుతుంటారు. రెంటి మధ్య అవినాభావ సంబంధం ఉందని ఆయన చెప్పేవారు. సామెతలపై ఆయన ఒక వ్యాసం రాయాలనుకున్నారు. ఇందుకోసం జయధీర్ తిరుమలరావు ఎనభైల్లోనే 200 సామెతల్ని సేకరించి ఆయనకు ఇచ్చారు. అయితే పోలీసుల దాడిలో అవి పోయాయి. "ఇటీవల రంజాన్ రోజు బాలగోపాల్‌తో చాలాసేపు గడిపే అవకాశం లభించింది. అప్పుడు మీరు సామెతలు ఇచ్చారు. నేను వ్యాసం రాయనే లేదు అని దాదాపు 20 ఏళ్ల తర్వాత బాలగోపాల్ గుర్తుచేశారు. ఇంకా చాలా టైముంది. మళ్లీ ఇస్తాను. రాద్దురుగానీ అన్నాను. ఇంతలో ఆయనే లేకుండా పోయారు" అని ఆవేదన చెందారు జయధీర్. "ఒకవేళ ఆయన

సాహిత్యం వైపు మళ్లితే గొప్ప సాహితీ వేత్త అయి ఉండేవారు" అని ఆయన అన్నారు. సాధన రాసిన రాగో నవలకు బాలగోపాలే ముందుమాట రాశారు. ఈ ముందుమాట నుంచే ఆయన విప్లవోద్యమాన్ని విమర్శనాత్మకంగా చూడడం మొదలైందంటారు. ప్రయాణాలు చేస్తూనే చదవడం, రాయడం బాలగోపాల్‌కున్న మరో అలవాటు. ఎక్కడికైనా వెళ్లినపుడు, దాని గురించి వెంటనే రాయాల్సి వస్తే, అది బస్టాండా, రైల్వే స్టేషనా అన్నది చూడకుండా రాసేసే వారు. ఆయనది సింగిల్ డ్రాఫ్ట్. రాసుకుంటూ పోవడమే.

10 అక్టోబర్, 2009, ఆంధ్రజ్యోతి దినపత్రిక